క్లుప్తంగా

ముమ్మరంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు



ఆత్మకూర్: ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్థానిక గాంధీచౌక్, చెరువుకట్ట వద్ద ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురుపై కేసు నమోదు చేశారు. అలాగే వాహనదారుల హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని, తాగి డ్రైవింగ్ చేయరాదని సూచించారు.

'ఉపాధి' పనుల పరిశీలన



చిన్నంబావి: మండలంలోని వెలగొండ, అమ్మాయిపల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపీడీఓ రమణరావు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలని, కూలీల నమోదు పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్యాడ్ల వితరణ



పాన్‌గల్: మండలంలోని శాగాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత నర్సింహస్వామిచారి శుక్రవారం ప్యాడ్లను వితరణగా అందజేశారు. రూ.3 వేల విలువ గల 30 ప్యాడ్లను విద్యార్థులకు అందజేయడంపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. దాతను హెచ్ఎం వెంకటస్వామియాదవ్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో పాఠశాలలో మెడికల్ క్యాంప్ నిర్వహించినట్లు హెచ్ఎం శ్రీనివాసులు తెలిపారు. ఈ క్యాంపులో విద్యార్థులకు చర్మ సమస్యలు, దురద, దగ్గు, రక్త పరీక్ష తదితర పరీక్షలు నిర్వహించారు. రక్త హీనత ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి కావలిసిన మందులను ఇచ్చారు. అనీమియా ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా క్యాంపు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కళ్యాణి, లక్ష్మి, ఫార్మసిస్టు శ్రీవిద్య, ఎమ్మార్సీ ప్రత్యేక అధికారి అర్జున్ ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి



గోపాల్‌పేట: పేకాట స్థావరంపై దాడి చేసి తొమ్మిది మందిని పట్టుకుని అరెస్టు చేశామని గోపాల్‌పేట ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం గోపాల్‌పేట మండలంలోని ఏదుట్ల శివారులో నీలం నరసింహ పొలం వద్ద పేకాట, కోళ్ల పందెలు ఆడుతున్నారని ఎస్పీ కార్యాలయానికి సమాచారం అందింది. దీంతో ఆమె స్థానిక పోలీసులను అప్రమత్తం చేయగా ఎస్ఐ హరిప్రసాద్ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట, కోడి పందెలు ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని 11 బైకులు, 10 కోడిపుంజులు, 8 సెల్‌ఫోన్లు, రూ.4,620 నగదు పట్టుకుని సీజ్ చేశామని ఎస్ఐ వెల్లడించారు.

బస్సును పునరుద్ధరించండి

వీపనగండ్ల: జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రానికి మధ్యాహ్నం 2 గంటల తరువాత బస్సు వసతి లేకపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, నాయకులు నర్సింహ, ఆశన్న ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా సమయానికంటే ముందు వనపర్తి ఆర్టీసీ డిపో అధికారులు సాయంత్రం 6 గంటలకు వనపర్తి నుంచి బయలుదేరి పెబ్బేరు, గోవర్ధనగిరి, గోవల్‌దిన్నె, వీపనగండ్ల, తూంకుంట గ్రామాల మీదుగా నైట్ హాల్ట్‌గా బస్సు కొల్లాపూర్‌కు చేరుకునేదని, ఆ బస్సును నేటికీ పునరుద్ధరించకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు బస్సును పునరుద్ధరించాలని కోరారు.



కంభాలాపురంలో..



పర్వతాపురం పాఠశాలలో..



ఖిల్లాఘనపురం ప్రాథమిక పాఠశాలలో..

ఉపాధ్యాయులే భవిష్యత్‌కు పునాది

సాక్షి, నెట్‌వర్క్: ఉపాధ్యాయులే విద్యార్థుల భవిష్యత్‌కు పునాదిలాంటి వారని విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఒక్కరోజు ఉపాధ్యాయులుగా మారి తాము నేర్చుకున్న పాఠాలను తమ తోటి విద్యార్థులకు వివరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన అనుభూతి గొప్పగా ఉందని, భవిష్యత్‌లో ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ విధులు తోటి విద్యార్థులకు చక్కగా పాఠాలు చెప్పారని కొనియాడారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.



వనపర్తిలో స్వయం పరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులైన విద్యార్థులు



వీపనగండ్ల ఉన్నత పాఠశాలలో..



కొత్తకోట ప్రాథమిక పాఠశాలలో..



మోట్లంపల్లిలో..



శాగాపూర్‌లో..



మామిడిమాడ ఉన్నత పాఠశాలలో..

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

కొత్తకోట రూరల్: దేవరకద్ర నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ ఉపాధ్యక్షుడిగా కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన సాయికుమార్‌యాదవ్‌ను దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి నియమించారు. ఈ మేరకు శుక్రవారం సాయికుమార్‌యాదవ్‌కు నియామకపత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. తనకు నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా పదవి వచ్చేందుకు కృషి చేసిన జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులకు సాయికుమార్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు యువకులను, విద్యార్థులను చైతన్యం చేయాలని ఎమ్మెల్యే సూచించినట్లు సాయికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ప్రశాంత్, బోయేజ్, కృష్ణారెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, భీచుపల్లియాదవ్, ముస్తఫా, రాములుసాగర్ ఉన్నారు.



నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

మదనాపురం: స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలలో శుక్రవారం చైల్డ్ లైన్ 1098 గురించి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీపీఎస్ అవుట్ రీచ్ జీవిత మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాన్ని శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. అమ్మాయిలు గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. లవ్ అండ్ అట్రాక్షన్‌పై అవగాహన కలిగి జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. బాల్యవివాహాలను చేసినట్లయితే 2006 ప్రకారం జైలు శిక్ష, జరిమానా, అమ్మాయిలపై లైంగిక దాడి చేసినట్లయితే 2012 పోక్సో యాక్టు ప్రకారం ఆక్ట్ ప్రకారం జైలు శిక్ష పడతాయని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రవిరాజు, ఎస్ఓ రేణుక, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జీవిత

మండల అభివృద్ధికి తోడ్పాటు

ఖిల్లాఘనపురం: మండల ఎంపీడీఓ విజయ్‌కుమార్ ప్రజలు, ప్రజాప్రతినిధులు, తోటి అధికారుల గుండెల్లో నిలిచిపోయేలా విధులు నిర్వహించారని ఎంపీపీ కృష్ణానాయక్ అన్నారు. మండల ఎంపీడీఓగా నాలుగున్నరేళ్లు విధులు నిర్వహించి ఇటీవలే బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఏపీఓ సత్యనారాయణకు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీతో పాటుగా తహసీల్దార్ పాండునాయక్, నూతన ఎంపీడీఓ వెంకటాచారి, మండల వ్యవసాయ అధికారి మల్లయ్య, ఎంపీఓ రాజు మాట్లాడారు. మండల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అనంతరం వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ ఏఈ కబీర్‌దాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, మాజీ సర్పంచులు పీనానాయక్, బాలాంజనేయులు, నిర్మల పాల్గొన్నారు.



ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఏపీఓ సత్యనారాయణను సన్మానిస్తున్న ఎంపీపీ తదితరులు

మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి



సూగూరులో మొక్కలకు నీరు పడుతున్న ఎంపీడీఓ రవీంద్ర



రాయినిపల్లి నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కోటేశ్వర్

పాన్‌గల్: వేసవి కాలం దృష్ట్యా నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ కోటేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లాయిపల్లి, చింతకుంట, మాందాపూర్, రాయినిపల్లి, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో చెట్టు, చెట్టుకు నీరు కార్యక్రమాన్ని, నర్సరీలు, ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ, హరితహారంలో నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పట్టాలన్నారు. ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచడం, కూలీల వద్ద వసతులు ఏర్పాటు చేయాలన్నారు. దీంతో పాటు జీపీలల్లో ఇంటి పన్ను వసూలు, తాగునీటి ఎద్దడి నివారణపై దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేర్ రూరల్: ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా నీరు పట్టాలని ఎంపీడీఓ రవీందర్ అన్నారు. శుక్రవారం వాటరింగ్ డేలో భాగంగా మండలంలోని సూగూర్ పంచాయతీలో రోడ్డుకు ఇరువైపులా నాటిన హరితహారం మొక్కలుకు నీరు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో 12 వేల మొక్కలను పెంచాలని, నర్సరీతో పాటు రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు ఎండిపోకుండా వాటర్ క్యూరింగ్ చేయాలన్నారు. నర్సరీల్లో దానిమ్మ, ఖర్జూర, ఈత, డెకోమ మొక్కలను పెంచుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్, టెక్నికల్ అసిస్టెంట్ యాదగిరి, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు పాల్గొన్నారు.

గాడ్గే బాబాకు ఘన నివాళి

వనపర్తి టౌన్: మనుషుల మధ్య వివక్షత ఉండకుండా సకల జనులు బాగుపడాలనే తాపత్రయమే అసలైన దైవత్వమని గాడ్గే బాబా ఆచరించి, ప్రబోధించాడని ప్రజా వాగ్గేయకారుడు రాజారామ్ ప్రకాశ్ పేర్కొన్నారు. శుక్రవారం గాడ్గే బాబా 148వ జయంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ... చిరిగిన దస్తువులు, తలపై చిప్ప, చేతులో చీపురు పట్టుకొని స్వచ్ఛదేశమే లక్ష్యంగా పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా భావించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పెబ్బేరు రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని పాతపల్లి శివారు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మార్గ మధ్యలో పాతపల్లి వద్ద బ్లూ కోల్ట్ పోలీసులు ఆపి అనుమతి పత్రాలు అడుగగా.. పత్రాలు లేకపోవడంతో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. డ్రైవర్ కావలి సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మున్సిపల్ కమిషనర్‌గా పూర్ణచందర్

వనపర్తి టౌన్: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా ఎం పూర్ణచందర్ శుక్రవారం రాత్రి 9గంటల తర్వాత బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ జిల్లా బాల్‌కొండ నియోజకవర్గానికి చెందిన పూర్ణచందర్ 1995లో ఏపీపీఎస్సీ ద్వారా పంచాయతీరాజ్ శాఖలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా విధుల్లో చేరారు. ఆయన 2011లో నకిరేకల్ మున్సిపాలిటీకి పదోన్నతిపై వచ్చారు. జమ్మికుంట మేనేజర్‌గా 2015లో విధులు నిర్వర్తించారు. అనంతరం గ్రేడ్-3 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి రావడంతో నాగర్‌కర్నూల్, దేవరకొండ, భువనగిరి, మిర్యాలగూడలో మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నెరవేర్చారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఈనెల 16న పూర్ణచందర్‌ను వనపర్తికి బదిలీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు శుభాకాంక్షలు తెలిపారు.

సాధారణ ప్రసవాలు పెంచాలి



గోపాల్‌పేట: గర్భిణుల ఆరోగ్య సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని సాధారణ ప్రసవాలు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డా. జయచంద్ర మోహన్ కోరారు. శుక్రవారం ఆయన స్థానిక పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి ఇప్పటి వరకు జరిగిన ప్రసవాలు, ఈ నెలలో ప్రసవాలకు ఎంతమంది ఉన్నారన్న విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల అనుమానాలు ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని, కేంద్రానికి వచ్చిన రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం బుద్దారం గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పది, ఇంటర్ విద్యార్థులు భయాన్ని వీడి పరీక్షలు రాయాలని.. నిత్యం యోగా, ధ్యానం చేస్తే ఒత్తిడిని జయించవచ్చని సూచించారు. ఏవైనా మానసిక సమస్యలు ఎదురైతే వెంటనే అందుబాటులో ఉన్న ఉపాధ్యాయులు, వైద్యులకు చెప్పాలని, శుభ్రమైన ఆహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఆయన వెంట డా. క్లైవిస్‌మార్క్, సీహెచ్ఓ సిద్ధగౌడ్, సూపర్‌వైజర్ సుచరిత, గురుకుల ప్రిన్సిపాల్ ఆరోగ్యం పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

పాన్‌గల్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతకుంట, రాయినిపల్లి, మల్లాయిపల్లి ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

పరీక్ష సమయానికి బస్సులు నడపాలి



డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

వనపర్తి టౌన్: ఇంటర్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సరైన సమయానికి వెళ్లేలా బస్సులు నడపాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని వనపర్తి ఆర్టీసీ డిపో ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడం ద్వారా విద్యార్థులు సరైన సమయాలకు విద్యా సంస్థలకు, ఇంటికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటికే డిపో మేనేజర్‌కు రెండుసార్లు వినతి పత్రం ఇచ్చినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డిపో అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా నాయకులు కేదార్నాథ్, కార్తీక్, శివ, సాయి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎడ్ల అశోక్‌రెడ్డి

వనపర్తి టౌన్: బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టే విజయ సంకల్ప యాత్ర శనివారం జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని, నియోజకవర్గ నాయకులు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ప్రభారి ఎడ్ల అశోక్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోడ్ షో అనంతరం రాజీవ్‌చౌరస్తాలో జరిగే బహిరంగ సభకు మాజీ మంత్రి ఈటల రాజేందర్, శాసన మండలి సభ్యుడు ఏవీఎన్ రెడ్డి, కృష్ణమ్మ క్లస్టర్ యాత్ర ఇన్‌చార్జ్ బంగారు శృతి హాజరుకానున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ, అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, రాగి రామకృష్ణారెడ్డి, శ్రీశైలం, చిత్తారి ప్రభాకర్, జ్యోతి రమణ, ప్రవీణ్, కుమారస్వామి, సుమిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గజవాహన సేవ



పుష్పరథం వద్ద బొడ్డెమ్మలు ఆడుతున్న మహిళలు

ఖిల్లాఘనపురం: మండలంలోని గట్టుకాడిపల్లి (అంజనగిరి) శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి గజవాహన సేవ, మహాసుదర్శన హవనము తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. గురువారం రాత్రి పుష్పరథం, హన్మంత సేవ కార్యక్రమాలను కనులపండువగా కొనసాగించారు. స్వామివారి పూజల అనంతరం పుష్పరథం వద్ద బొడ్డెమ్మలు ఆడుతూ, స్వామివారి నామ జపంతో భక్తులు ముందుకు సాగారు. శనివారం రాత్రి 11 గంటల నుంచి ఆలయం వద్ద తేరు (రథోత్సవం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు పండితులు కన్నయ్య తెలిపారు.

రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం



కొత్తకోటలో కార్మికులతో కలిసి నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు



పెబ్బేర్‌లో..

కొత్తకోట రూరల్: కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఢిల్లీలో చేపట్టిన నిరసనలో అన్నదాతలు చావులకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు నిక్సన్ డిమాండ్ చేశారు. మృతి చెందిన రైతులకు సంతాపం ప్రకటిస్తూ శుక్రవారం కొత్తకోట చౌరస్తాలో కార్మికులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు చట్టాలను వ్యతిరేకిస్తూ పంజాబ్ సరిహద్దుల్లో నిరసన చేస్తుండగా రైతు శుభకరణ్ సింగ్‌ను పోలీసులే చంపారని ఆరోపించారు. కార్యక్రమంలో కుర్మన్న, యాదయ్య, మల్లేష్, శివన్న, కొండన్న, వెంకటయ్య, బాలరాజు, తిమ్మన్న తదితరులు ఉన్నారు.

అమరచింత: కేంద్రం రైతులపై నిర్బంధ విధానాలను అవలంబిస్తుందని, రైతు వ్యతిరేక విధానాలపై మోదీ ప్రభుత్వ తీరుపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని రైతు, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. పట్టణంలో శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలో రైతులపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన నిర్వహించారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కోశాధికారి వెంకటేష్, ఆర్ఎన్ రమేష్, అజయ్, రాఘవేంద్ర, ఎస్ఈ శ్యాంసుందర్ ఉన్నారు.

పెబ్బేర్‌రూరల్: కేంద్రం తీరుపై నిరసన చేస్తున్న యువరైతు శుభకరణ్‌సింగ్‌ను పోలీసులచే కాల్చి చంపారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, సీపీఎం కార్యదర్శి ఎండీ పెద్దఖాజా ఆరోపించారు. శుక్రవారం పెబ్బేరు చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు అమరులకు నివాళులర్పించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో భీసన్న, తిరుపతి, చెన్నయ్య, రాముడు, రాజు, భాను పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లాస్య నందిత మృతి తీరని లోటు



కొత్తకోటలో ఎమ్మెల్యే లాస్య నందిత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కొత్తకోట: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. శుక్రవారం కొత్తకోట చౌరస్తాలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు లాస్య నందిత చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వామన్‌గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే లాస్య నందిత తండ్రి సాయన్న చూపించిన మార్గంలో నడిచేందుకు చిన్న వయస్సులో ఎమ్మెల్యేగా గెలిచి ప్రజాసేవలోకి వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, గాడీల ప్రశాంత్, విశ్వేశ్వర్, చీర్లనాగన్నసాగర్, గుంత మల్లేష్, కృష్ణయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

పాన్‌గల్: ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో అకాల మృతి చెందడంపై ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్‌నాయక్, వెంకటయ్యానాయుడు సంతాపం తెలిపారు. ఆమె అకాల మరణం కుటుంబానికి, పార్టీకి తీవ్ర నష్టమని వారు పేర్కొన్నారు.